# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 25-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆర్థిక బిల్లు - 2025కు లోక్ సభ ఈరోజు ఆమోదం తెలిపింది.
- ❖ విపత్తు నిర్వహణలో భారత్ గత పది సంవత్సరాలలో గణనీయమైన పురోగతి సాధించిందని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- ❖ భారత్ తన మొట్టమొదటి స్వదేశీ MRI వైద్య యంత్రాన్ని అభివృద్ధి చేసింది.
- ❖ రోడ్డు ప్రమాదాల కారణంగా దేశంలో సంవత్సరానికి 1.78 లక్షల మంది మరణిస్తున్నారని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.

=======================

పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా 35 ప్రభుత్వ సవరణలతో ఆర్థిక బిల్లు-2025కు లోక్ సభ ఈరోజు ఆమోదం తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కంటే 7.4 శాతం అధికంగా 50.65 లక్షల కోట్ల రూపాయలతో 2025-26 బడ్జెట్ ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. లోక్ సభలో ఈరోజు ఆర్థిక బిల్లుపై జరిగిన చర్చలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక ప్రతిపాదనలను అమలు చేయడానికి ఈ బిల్లుని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఫిబ్రవరి 13న లోక్ సభలో ప్రవేశపెట్టిన నూతన ఆదాయపు పన్ను బిల్లు... ప్రస్తుతం సెలెక్ట్ కమిటీ పరిశీలనలో ఉందని, వచ్చే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో దీనిపై చర్చ చేపడతామని అన్నారు. నూతన పన్ను విధానంలో 12 లక్షల రూపాయల ఆదాయం వరకు ఆదాయపు పన్ను ఉండదని స్పష్టం చేశారు. ఈ ఆర్థిక బిల్లు పారిశ్రామిక వస్తువులకి సంబంధించిన ఏడు కస్టమ్ టారిఫ్ రేట్లను తొలగించాలని ప్రతిపాదించిందని నిర్మలా సీతారామన్ వెల్లడిస్తూ....

(వాయిస్ 27 సెకన్లు)

కాగా బిల్లు ఆమోదంతో లోక్ సభలో బడ్జెట్ ప్రక్రియ పూర్తయింది. ఈ బిల్లును రాజ్యసభ ఆమోదించాల్సి ఉంది. ఆ తర్వాత 2025-26కు సంబంధించిన కేంద్ర బడ్జెట్ ప్రక్రియ పూర్తవుతుంది.

======================

విపత్తు నిర్వహణ సవరణ బిల్లు 2024పై ఈరోజు రాజ్య సభలో చర్చ చేపట్టారు. అందులో భాగంగా భారతదేశంలో విపత్తు సంసిద్ధత, ప్రతిస్పందన పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ... ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని దేశం సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ బిల్లు లక్ష్యమని తెలిపారు. భారతదేశ విపత్తు నిర్వహణ చట్రాన్ని బలోపేతం చేసేందుకు ఈ బిల్లు దోహద పడుతుందని అన్నారు.. విపత్తు నిర్వహణలో గత 10 సంవత్సరాల్లో సాధించిన పురోగతి భారత్ ను శక్తివంతమైన దేశంగా మార్చిందన్నారు.

(వాయిస్ 32 సెకన్లు)

======================

భారత్ తన మొట్టమొదటి స్వదేశీ MRI యంత్రాన్ని అభివృద్ధి చేసింది. దీనిని అక్టోబర్ నాటికి ఎయిమ్స్ న్యూఢిల్లీలో ట్రయల్స్ కోసం ఏర్పాటు చేయనున్నారు. ఎలక్ట్రానిక్స్ & ఐటీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో AIIMS, SAMEER సంయుక్తంగా ఈ ప్రాజెక్టుని చేపట్టాయి. 80 నుంచి 85 శాతం పరికరాలను భారత్ ప్రస్తుతం దిగుమతి చేసుకుంటున్నందున, చికిత్స ఖర్చులను తగ్గించడంతో పాటూ.. దిగుమతి చేసుకున్న వైద్య పరికరాలపై ఆధారపడటం ఈ ఆవిష్కరణ ద్వారా తగ్గుతుంది. స్వదేశీ MRI యంత్రం భారతదేశాన్ని వైద్య సాంకేతికతలో మరింత స్వావలంబన చేయడానికి దోహదపడుతుంది.

======================

ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఈరోజు అసెంబ్లీలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో ఇటీవల ఏర్పడిన బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వానికి ఇది తొలి బడ్జెట్. ఆర్థిక శాఖ మంత్రి గానూ వ్యవహరిస్తున్న రేఖా గుప్తా ప్రవేశపెట్టిన లక్ష కోట్ల రూపాయల బడ్జెట్ ప్రతి రంగం వృద్ధిపై దృష్టి సారిస్తుందని చెప్పారు. ఈ బడ్జెట్ వికసిత్ ఢిల్లీ ప్రయాణానికి మార్గం సుగుమం చేస్తుందని ముఖ్యమంత్రి రేఖా గుప్తా పేర్కొన్నారు.

విరామం

======================

భారతదేశంలో రోడ్డు ప్రమాదాల కారణంగా సంవత్సరానికి 1.78 లక్షల మంది మరణిస్తున్నారని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. రహదారి భద్రతపై ఈరోజు న్యూ ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో రోడ్డు ప్రమాద మరణాలలో 60 శాతం కంటే ఎక్కువ 18 నుండి 45 సంవత్సరాల వయస్సు గల వారేనని వెల్లడించారు. దేశం రోడ్డు ప్రమాదాల కారణంగా స్థూల దేశీయోత్పత్తిలో 3 శాతం కోల్పోతోందని అన్నారు. రహదారి భద్రతను మెరుగుపరచాల్సిన తక్షణ అవసరాన్ని ప్రస్తావించారు. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వేగవంతమైన వృద్ధిని పర్యావరణహిత రవాణా వైపు ఒక కీలక అడుగుగా నితిన్ గడ్కరీ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

======================

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ వివాదంపై రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఈ రోజు మధ్యాహ్నం సభా నాయకులతో సమావేశమయ్యారు. దీనిని తీవ్రమైన సమస్యగా అభివర్ణిస్తూ... ఈ సమస్య పార్లమెంటు సార్వభౌమాధికారం, ఔచిత్యానికి సంబంధించిందని పేర్కొన్నారు. ఈ విషయంలో సత్వర చర్యలు తీసుకున్నందుకు

ప్రధాన న్యాయమూర్తిని ఆయన ప్రశంసించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే చైర్మన్ నిర్ణయాన్ని స్వాగతించారు.

=======================

'ఒక దేశం, ఒక ఎన్నిక' అనే అంశంపై ఏర్పాటైన పార్లమెంట్ సంయుక్త కమిటీ పదవీకాలాన్ని పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి వారం మొదటి రోజు వరకు పొడిగించారు. దీనికి సంబంధించి కమిటీ చైర్మన్ పి.పి. చౌదరి ఈరోజు లోక్‌సభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టగా దీనికి సభ ఆమోదం తెలిపింది.

=======================

వరల్డ్ ఆడియో విజువల్ & ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్ సదస్సు) ముంబైలో మే 1 నుండి 4వ తేదీ వరకు జరగనుంది. యానిమేషన్, గేమింగ్, విజువల్ ఎఫెక్ట్స్, ఎక్స్ టెండెడ్ రియాలిటీలో నూతన అవకాశాలను అన్వేషించడానికి వేవ్స్ సదస్సు కంటెంట్ సృష్టికర్తలు పెట్టుబడిదారులను ఒకచోట చేర్చుతుంది. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాలలో భారతదేశాన్ని ప్రపంచ శక్తి కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో ఈ సదస్సుని నైపుణ్య అభివృద్ధిని ప్రోత్సహిస్తోంది. వేవ్స్ సదస్సు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సృష్టికర్తలకు ఒక వేదికలా మాత్రమే కాకుండా ప్రపంచ వినోద భవిష్యత్తును మార్చే అత్యంత శక్తివంతమైన ప్రయత్నంగా నిలుస్తుందని నటుడు అక్షయ్ కుమార్ సామాజిక మాధ్యమంలో విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

=======================

శాంతి పరిరక్షణ సంస్కరణలపై ఐక్యరాజ్యసమితిలో జరిగిన చర్చలో పాకిస్థాన్ పదేపదే జమ్మూ కాశ్మీర్ ప్రాంతాన్ని ప్రస్తావించడాన్ని భారత్ ఖండించింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూ కశ్మీర్ పై పాకిస్తాన్ ప్రతినిధి మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ అసహనం వ్యక్తం చేశారు. శాంతిస్థాపనకు సంబంధించిన కీలక చర్చల నుంచి దృష్టి మరల్చేందుకు పాకిస్తాన్ ప్రయత్నిస్తోందని భారత శాశ్వత ప్రతినిధి పేర్కొన్నారు.

=======================

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఈరోజు భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల కదలికలపై సమాచారం అందడంతో బీజాపూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో భద్రతా దళాల ఉమ్మడి బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టిందని దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపారు.

=======================
=======================